

## విలువలకు, సిద్ధాంతాలకు కట్టుబడే సినిమాలు తీస్తాను

'ఈ మధ్యే 'హ్యాపీడేస్' చూశాను. ఇప్పటికీ ఫ్రెష్‌గా అనిపించింది. ఈ సినిమాకు అన్నీ కుదిరాయి. రీరిలీజ్ చేస్తే ప్రజెంట్ యూత్ బాగా ఎంజాయ్ చేస్తారు. టైసన్ పాత్ర చాలా మేజిక్‌గా ఉంటుంది' అన్నారు శేఖర్ కమ్ముల. 17ఏళ్ల క్రితం ఆయన దర్శకత్వంలో వచ్చిన సినిమా 'హ్యాపీడేస్'. 2017లో విడుదలైన ఈ సినిమా భారీ విజయాన్ని నమోదు చేసుకోవడమేకాక, అప్పటి యువతరాన్ని ఉర్రూతలూగించింది. శుక్రవారం ఈ సినిమా రీరిలీజ్ కానుండటం, దర్శకుడిగా శేఖర్ కమ్ముల కూడా ఇండస్ట్రీలో 24ఏళ్లు పూర్తి చేసుకోబోతుండటం.. ఈ సందర్భాలను పురస్కరించుకొని ఆయన మీడియాతో ముచ్చటించారు. రెండు దశాబ్దాల పైచిలుకుగా సాగిన తన సినీ ప్రయాణాన్ని చూస్తే గర్వంగా అనిపిస్తుందని, ఏ సినిమా చేసినా చెడు చెప్పకుండా విలువలు, సిద్ధాంతాలకు కట్టుబడి సినిమాలు చేశాననీ, డబ్బు, పేరుకోసం తాను ఈ రంగంలోకి రాలేదని శేఖర్ కమ్ముల పేర్కొన్నారు. కథ విషయంలో ఆలోచన రావడానికి, కార్యరూపం దాల్చడానికి సమయం పడుతుందనీ, వేగంగా సినిమాలు తీయడం కంటే గుర్తుండిపోయే సినిమాలు తీయడం తన అభిమతమని శేఖర్ కమ్ముల చెప్పారు. ధనుష్ సినిమా గురించి మాట్లాడుతూ 'అది పెద్ద స్కేల్ సినిమా. పెద్ద ఐడియాతో ఉండే సినిమా. నాగార్జున, ధనుష్ ఈ కథకు యాప్ట్. ఇంతకంటే ఈ సినిమా గురించి ఎక్కువ చెప్పకూడదు' అన్నారు శేఖర్‌కమ్ముల. 'లీడర్' సీక్వెల్ తీయాలనే ఆలోచన ఉందని, ఆ సినిమా చేస్తే మాత్రం తప్పకుండా రానాతోనే చేస్తానని అన్నారు. 'నేటి రాజకీయాలు మరీ దిగజారిపోయాయి. దీనికి చెప్పే సొల్యూషన్ లాజిక్‌గా ఉండాలి. సమస్య చెబితే పరిష్కారం కూడా చెప్పాలి. దానికి టైం పడుతుంది' అని తెలిపారు శేఖర్‌కమ్ముల.



## లిమిట్స్ దాటి ప్రవర్తించకు!

సినిమాను తెలిగ్గా జనాల్లోకి తీసుకెళ్లడానికి వినూత్నంగా ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఊహించని విధంగా వీధుల్లో కొచ్చేసి అల్లరి చేసేయడం, లైవ్ నడుస్తుంటే యాంకర్‌తో గొడవ పెట్టేసుకోవడం.. ఇలా అన్నమాట. ఇది ముందుగా ప్లాన్ చేసుకొని చేస్తున్న నాటకాలని తెలియని జనం ఆ గొడవని రిపీట్ చేసి చూడటం.. దీంతో సదరు చిత్రానికి ఆటోమేటిగ్గా ప్రచారం లభించడం.. ఇదో కొత్త స్ట్రాటజీ. ఈ పోకడ శృతిమించడంతో.. సాంఘిక మాధ్యమం వేదికగా ఇద్దరు వ్యక్తులకు నిజంగానే గొడవ జరిగినా.. అది కూడా పబ్లిసిటీ స్టంటే అంటున్నారు. రీసెంట్‌గా నభా నటేష్‌కీ, నటుడు ప్రియదర్శికీ ఎక్స్(ట్విటర్) వేదికగా మాటల యుద్ధం జరిగింది. ఈ గొడవ ఇప్పుడు ఓ రేంజ్‌లో వైరల్ అవుతున్నది. వివరాల్లోకెళ్తే.. హీరో ప్రభాస్ వాయిస్‌తో డబ్‌స్మాష్ వీడియోను నభా ఇటీవలే పోస్ట్ చేసింది. ఆ పోస్ట్‌పై స్పందించిన ప్రియదర్శి 'వావ్.. సూపర్ డార్లింగ్.. కిర్రాక్' అంటూ రిప్లై ఇచ్చాడు. దీంతో 'ఐపీసీ సెక్షన్ 354ఏ ప్రకారం పరిచయం లేని ఒక స్త్రీని డార్లింగ్ అని సంబోధించడం లైంగిక వేధింపులతో సమానం' అని రాసి ఉన్న ఒక మెసేజ్‌తో ప్రియదర్శికి రిప్లై ఇచ్చి, 'మిస్టర్.. కామెంట్ చేసే ముందు మాటలు జాగ్రత్త' అని కూడా రాసింది నభా. 'మనకు పరిచయం లేదన్న విషయం నాకు తెలీదు.. మీరైతే డార్లింగ్ అనేయొచ్చు.. మేమంటే సెక్షన్లా?' అంటూ ప్రియదర్శి ఎదురు ప్రశ్నిస్తూ.. లైట్ తీస్కో డార్లింగ్..' అని మరో రిప్లై ఇచ్చాడు. దాంతో నభా కోపం నషాళానికి అంటి.. 'లిమిట్స్ దాటి ప్రవర్తించకు.. తర్వాత చూసుకుందాం' అంటూ సీరియస్‌గా రిప్లై ఇచ్చింది. ప్రస్తుతం ఈ చాటింగ్ వైరల్ అవుతున్నది. నెటిజన్స్ ఎవరికి తోచినట్టు వారు స్పందిస్తున్నారు. కొందరైతే.. వీరిద్దరూ కలిసి సినిమా చేయబోతున్నారనీ, సినిమా పేరు 'డార్లింగ్' అనీ, సినిమా ప్రమోషన్ కోసం జనాన్ని పిచ్చోళ్లని చేస్తున్నారని అభిప్రాయపడుతున్నారు.

## మిస్టర్ బచ్చన్ హంగామా..

రవితేజ హీరోగా హరీశ్‌శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఉత్తర ప్రదేశ్‌లో 30 రోజుల సుదీర్ఘ షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. కీలక షెడ్యూల్‌ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్రబృందం అంతా కలిసి అయోధ్య బాలక్ రామ్‌ని దర్శనం చేసుకొని ఆశీస్సులు అందుకున్నారు. మిగిలిన నిర్మాణం పూర్తి చేసి త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు. రవితేజ పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఈ చిత్రానికి కెమెరా: అయనంక బోస్, సంగీతం: మిక్కీ జె.మేయర్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.



## అశోకుని రహస్య శాసనం 'మిరాయ్'



''హను-మాన్' హీరోగా నా బాధ్యత పెంచింది. అందుకే జాగ్రత్తగా కథను ఎంచుకొని ఈ సినిమా చేస్తున్నాను. ఇందులో నన్ను యోధుడిగా చూపించబోతున్నాడు దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని. ఆరు నెలల ముందే సినిమా మొదలు పెట్టాం' అని కథానాయకుడు తేజ సజ్జా తెలిపారు. ఆయన హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'మిరాయ్'. 'సూపర్ యోధ' ఉపశీర్షిక. వచ్చే ఏడాది ఏప్రిల్ 18న పాన్ వరల్డ్ స్థాయిలో సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం ఈ సినిమా గ్లింప్స్‌ని ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు విడుదల చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'అశోకుని కాలంలోని రహస్య శాసనం 'మిరాయ్'. కొందరు దాన్ని కాపాడుతుంటారు. ఆ శాసనానికీ, ఈ కథకూ సంబంధం ఏంటి? అనే విషయం ఆసక్తికరంగా ఉంటుంది' అని దర్శకుడు కార్తీక్ చెప్పారు. విజన్ ఉన్న దర్శకుడు కార్తీక్ అని, వెండితెరపై కన్నుల పండువగా సినిమా ఉండబోతున్నదని, భారతీయ భాషల్లోనే కాక, చైనాలో కూడా సినిమా విడుదల చేస్తామని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ చెప్పారు. ఇంకా యూనిట్‌సభ్యులతో పాటు దర్శకులు నందినీరెడ్డి, శ్రీరామ్ ఆదిత్య, మల్లిక్‌రామ్, కృష్ణచైతన్య, నిర్మాతలు సాహు గారపాటి, అభిషేక్ అగర్వాల్, బెక్కం వేణుగోపాల్, ఎస్‌కేఎన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## కృష్ణ ఫ్రమ్ బృందావనం

ఆది సాయికుమార్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కృష్ణ ఫ్రమ్ బృందావనం' గురువారం ప్రారంభమైంది. వీరభద్రమ్ చౌదరి దర్శకుడు. లక్ష్మీ ప్రసన్న ప్రొడక్షన్స్ పతాకంపై తూము నరసింహా, జామి శ్రీనివాసరావు నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి అగ్ర నిర్మాత దిల్‌రాజు క్లాప్‌నివ్వగా, దర్శకుడు అనిల్ రావిపూడి కెమెరా స్విచాన్ చేశారు. 'చుట్టాలబ్బాయ్' తర్వాత ఆదిసాయికుమార్‌తో చేస్తున్న చిత్రమిదని, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఆద్యంతం చక్కటి వినోదంతో ఆకట్టుకుంటుందని దర్శకుడు తెలిపారు. జూన్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని నిర్మాతలు పేర్కొన్నారు. మురళీధర్ గౌడ్, పృథ్వీ, రఘు బాబు, అనివాష్, రచ్చ రవి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్, సంగీతం: అనూప్‌రూబెన్స్, సంభాషణలు: రాము మన్నార్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వీరభద్రమ్ చౌదరి.





## కూతురికి గురువు పాత్రలో...

అగ్ర హీరో షారుఖ్‌ఖాన్ కుమార్తె సుహానా ఖాన్ సినీ రంగంలో వడివడిగా అడుగులు వేస్తున్నది. 'ది ఆర్చీస్' చిత్రం ద్వారా ఓటీటీ వేదికపై అరంగేట్రం చేసిన ఆమె ప్రస్తుతం హిందీలో ఓ భారీ సినిమాలో నటించబోతున్నది. 'కింగ్' పేరుతో దర్శకుడు సుజయ్‌ఘోష్ తెరకెక్కించబోతున్న ఈ సినిమాలో షారుఖ్‌ఖాన్ అతిథి పాత్రలో నటించనున్నారని తొలుత వార్తలొచ్చాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో షారుఖ్ పూర్తిస్థాయి పాత్రలో నటించనున్నారని, కుమార్తె సుహానాఖాన్‌తో సమాంతరంగా ఆయన పాత్ర సాగుతుందని తెలిసింది. ఈ సినిమాలో వారిద్దరు తండ్రీకూతుళ్లుగా కనిపించబోతున్నారని ప్రచారం జరిగింది. అయితే అందులో నిజం లేదని.. సుహానాఖాన్‌కు మార్గదర్శనం చేసే శక్తివంతమైన గురువుగా షారుఖ్‌ఖాన్ పాత్ర సాగుతుందని చెబుతున్నారు. 'ఈ సినిమా స్క్రిప్ట్‌లో చాలా మార్పులు చేశాం. సుహానాఖాన్ తొలి థియేట్రికల్ రిలీజ్ కాబట్టి భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నాం. షారుఖ్‌ఖాన్‌తో సమానంగా సుహానాఖాన్ పాత్ర ఉంటుంది' అని చిత్ర బృందం పేర్కొంది. ఆగస్ట్‌లో ఈ చిత్రం సెట్స్‌మీదకు వెళ్లనుంది.

## మేడమ్ సార్ మేడమ్ అంతే..

రావు రమేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మారుతినగర్ సుబ్రమణ్యం'. లక్ష్మణ్ కార్య దర్శకుడు. ఈ సినిమాలో అంకిత్, రమ్య పసుపులేటి జంటగా నటిస్తున్నారు. వినోదాత్మక కుటుంబ కథా చిత్రంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రావు రమేష్ కొడుకు పాత్రలో అంకిత్ నటించారు. ఆయన ప్రేయసిగా రమ్య పసుపులేటి కనిపించనుంది. ఈ ప్రేమికుల జంట మీద తెరకెక్కించిన 'మేడమ్ సార్ మేడమ్ అంతే' అనే పాటను ఇటీవల విడుదల చేశారు. 'ఈ సినిమాలో అల్లు అర్జున్ అభిమానిగా అంకిత్ కనిపిస్తారు. హీరోయిన్ ఇంట్రడక్షన్ సన్నివేశంలో అల్లు అర్జున్ సినిమాలోని పాటను గుర్తుకు తెస్తూ ప్రేమగీతాన్ని ఆలపిస్తాడు. ఆ సందర్భంలో వచ్చే పాట ఇది' అని చిత్రబృందం పేర్కొంది. సిధ్‌శ్రీరామ్ ఆలపించిన ఈ పాటకు కల్యాణి నాయక్ బాణీలను సమకూర్చగా భాస్కరభట్ల సాహిత్యాన్నందించారు. ఈ చిత్రానికి కెమెరా: ఎం.ఎన్.బాల్‌రెడ్డి, నిర్మాతలు: బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య, కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు, దర్శకత్వం: లక్ష్మణ్ కార్య.



## ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో...



'హను-మాన్' చిత్రం పాన్ ఇండియా స్థాయిలో భారీ విజయాన్ని సాధించింది. ఈ చిత్రంతో దర్శకుడు ప్రశాంత్‌వర్మ పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపును సంపాదించుకున్నాడు. ప్రస్తుతం ఆయన సీక్వెల్ 'జై హనుమాన్' చిత్రంతో బిజీగా ఉన్నారు. తాజా సమాచారం ప్రకారం బాలీవుడ్ అగ్ర హీరో రణవీర్‌సింగ్‌తో ప్రశాంత్‌వర్మ భారీ పాన్‌ఇండియా సినిమాను తెరకెక్కించబోతున్నట్లు తెలిసింది. 'హనుమాన్' సినిమా రణవీర్‌సింగ్‌కు బాగా నచ్చిందని, దాంతో ప్రశాంత్‌వర్మతో సినిమా చేయడానికి ఆయన ఆసక్తిని చూపించారని అంటున్నారు. ఇటీవలే వీరిద్దరి మధ్యలో కథా చర్చలు కూడా పూర్తయ్యాయని, పౌరాణిక నేపథ్యంతో పీరియాడికల్ కథాంశంతో ఈ సినిమా తెరకెక్కనుందని సమాచారం. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడుతుందని చెబుతున్నారు. ఇక 'హనుమాన్'కు సీక్వెల్‌గా రూపొందబోతున్న 'జై హనుమాన్' త్వరలో సెట్స్‌మీదకు వెళ్లనుంది. వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## ప్రియమైన దొంగ



అభినవ్ గోమఠం టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'మై డియర్ దొంగ'. శాలినీ కొండెపూడి, దివ్య శ్రీపాద, నిఖిల్ గాజుల, వంశీధర్ గౌడ్, శశాంక్ మండూరి ప్రధాన పాత్రధారులు. బీఎస్ సర్వాంగ కుమార్ దర్శకుడు. మహేశ్వరరెడ్డి గోజల నిర్మాత. త్వరలోనే ఓటీటీలో సినిమా విడుదల కానుంది. ప్రమోషన్లో భాగంగా హైదరాబాద్‌లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. నటుడు ప్రియదర్శి ట్రైలర్‌ను విడుదల చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. ఒక మంచి ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు ఆనందంగా ఉందని అభినవ్ గోమఠం ఆనందం వ్యక్తం చేశారు. 'ఈ కథ రాసిన అమ్మాయి శాలినీనే ఇందులో కథానాయికగా నటించడం గొప్ప విషయం. తక్కువ సమయంలో మంచి అవుట్‌పుట్ ఇచ్చిన దర్శకుడు సర్వాంగ రియల్లీ గ్రేట్. సాంకేతికంగా కూడా అందరికీ నచ్చే సినిమా అవుతుంది' అని నిర్మాత తెలిపారు. తన స్క్రిప్ట్‌నీ, నటననూ నమ్మిన నిర్మాతకు చిత్ర రచయిత, కథానాయిక అయిన శాలినీ కృతజ్ఞత తెలిపింది. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులంతా మాట్లాడారు.

## అలరించే ప్రేమకథ



'ఓ ఇండిపెండెంట్ అమ్మాయి, సాఫ్ట్‌వేర్ అబ్బాయి మధ్య సాగే ప్రేమకథే 'మార్కెట్ మహాలక్ష్మి'. ఈ సినిమాలో మేం ఓ కొత్త విషయాన్ని చెప్పాం. అదేంటో సినిమా చూసే తెలుసుకోవాలి.' అంటున్నారు నిర్మాత అఖిలేశ్ కలారు. ఆయన నిర్మించిన చిత్రం 'మార్కెట్ మహాలక్ష్మి'. పార్వతీశం, ప్రణీకాన్వికా జంటగా నటించారు. వీఎస్ ముఖేష్ దర్శకుడు. ఆయనే ఈ చిత్రానికి కథ, కథనం, మాటలు కూడా అందించారు. శుక్రవారం ఈ సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా నిర్మాత విలేకరులతో ముచ్చటించారు. 'ఇందులో నటించిన నటీనటులందరూ తన పాత్రలకు వందశాతం న్యాయం చేశారు. పార్వతీశం, ప్రణీకాన్విక అయితే జీవించారు. వారి కెమిస్ట్రీ తెరపై చాలా బావుంటుంది. ఇక దర్శకుడు ముఖేష్ అయితే.. చెప్పిన దానికంటే అద్భుతంగా తీశాడు. బాక్సాఫీస్ విజయాన్ని ఈ సినిమా సాధిస్తుందనే నమ్మకంతో ఉన్నాను.' అని నమ్మకం వ్యక్తం చేశారు అఖిలేశ్. మరిన్ని మంచి సినిమాలను నిర్మించి, అభిరుచిగల నిర్మాత అనిపించుకోవడం తన ధ్యేయమని అఖిల్ చెప్పారు.



## జర్నీ టూ అయోధ్య

భారతీయ పురాణ ఇతిహాసం రామాయణం ఆధారంగా తెలుగులో మరో చిత్రానికి సన్నాహాలు జరుగుతున్నాయి. 'జర్నీ టూ అయోధ్య' పేరుతో చిత్రాలయం స్టూడియోస్ పతాకంపై నిర్మాత వేణు దోనేపూడి ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాకు రూపకల్పన చేస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు వి.ఎన్.ఆదిత్య కథనం దిస్తుండగా, తమ్మారెడ్డి భరద్వాజ నిర్మాణ సారథ్యం వహించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్వ నిర్మాణ కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఓ యువ దర్శకుడు తెరకెక్కిస్తారని, నటీనటులు..సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడిస్తామని చిత్ర బృందం పేర్కొంది.


